సాక్షి
కుమురం భీం
గురువారం । 30 । మే । 2024



ఆర్టీసీ ప్రాంగణంలో ఫంక్షన్ హాల్
బెల్లంపల్లి బస్టాండ్ ప్రాంగణంలోని ఖాళీ స్థలం వాణిజ్య రూపం దాల్చే అవకాశం కనిపిస్తోంది. ప్రైవేట్ వ్యక్తులకు అద్దెకు ఇవ్వాలని అధికారులు యోచిస్తున్నారు. 8లో▸



పశువులకు వడదెబ్బ!
జిల్లాలోని పలు ప్రాంతాల్లో 45 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలతో పశువులు వడదెబ్బ బారిన పడే అవకాశం ఉంది. 9లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
43.4 /31.3
చాలావరకు ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. ఉదయం నుంచే వేడి తీవ్రంగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది.

సర్కారుకు బాట వేద్దాం

- జూన్ 3 నుంచి 11 వరకు 'బడిబాట'
- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచడమే లక్ష్యం..
- మార్గదర్శకాలు విడుదల చేసిన విద్యాశాఖ
- అందరి భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని ఆదేశాలు
- జిల్లాలో 720 ప్రభుత్వ పాఠశాలలు

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు (లోకల్‌బాడీ)	
ప్రాథమిక	560
ప్రాథమికోన్నత	102
ఉన్నత	58
మొత్తం పాఠశాలలు	720



సావర్‌ఖెడాలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు(ఫైల్)

కెరమెరి(ఆసిఫాబాద్): బడిబాట కార్యక్రమానికి వేళైంది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు జూన్ 3 నుంచి 11 వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. గతం కంటే మెరుగ్గా కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రభుత్వం నూతన విధివిధానాలు రూపొందించింది. 2024– 25 విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యా క్యాలెండర్ ఇప్పటికే విడుదలైన విషయం తెలిసిందే. దానికి అనుగుణంగా ప్రతినెలా నాలుగో శనివారం నో బ్యాగ్ డేను పకడ్బందీగా నిర్వహించనున్నారు. ప్రతిరోజూ 90 శాతం విద్యార్థుల హాజరు ఉండేలా చూడాలని సూచించారు. 30 నిమిషాల పాటు పాఠ్యపుస్తకాలు, కథలు, దినపత్రికలు చదవించనున్నారు. యోగా, ధ్యానం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు.

ప్రవేశాలు పెంచే లక్ష్యంతో..
సర్కారు పాఠశాలల్లో ప్రవేశాలు పెంచే లక్ష్యంతో ఏటా రాష్ట్ర ప్రభుత్వం బడిబాట కార్యక్రమం చేపడుతుంది. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 1264 ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ పాఠశాలలు(స్థానిక సంస్థలు) 720 ఉన్నాయి. దాదాపు 42 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఏటా ప్రస్తుతం ఉన్న విద్యార్థుల కంటే 20 శాతం పెంచాలనేది ప్రభుత్వ లక్ష్యం. గతేడాది సీఆర్పీలు 901 మంది బడిబయట విద్యార్థులను గుర్తించారు. ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా విద్యార్థుల సంఖ్యను పెంచుకునేందుకు ప్రభుత్వ పాఠశాలలు సాధించిన ప్రగతి, బడుల్లో సదుపాయాలు, గుణాత్మక విద్యా బోధన తదితర అంశాలను ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించనున్నారు. పల్లెలు, పట్టణాల్లో పర్యటించి అవగాహన కల్పించనున్నారు. గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ వర్గాలను భాగస్వాములను చేస్తూ వచ్చే నెల 3 నుంచి 11 వరకు బడిబాట కార్యక్రమం కొనసాగనుంది. పాఠశాలల పునఃప్రారంభం తర్వాత కూడా అంటే 12వ తేదీ నుంచి 19 వరకు కూడా ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

మౌలిక సదుపాయాల కల్పన
బడులను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని 685 స్కూళ్లలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. ఇందుకోసం రూ.25.50 కోట్లు కేటాయించారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, ఇతర మరమ్మతులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే 80 శాతం వరకు పనులు పూర్తయ్యాయి. పాఠశాలల పునఃప్రారంభం నాటికి పనులు వందశాతం పూర్తి చేసే దిశగా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. అలాగే విద్యార్థులకు సకాలంలో యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

బడిబాట కార్యక్రమాలు ఇలా..

జూన్ 3న : గ్రామంలో వీవో సభ్యులతో సమావేశం నిర్వహించాలి. బడిబాట గురించి చర్చించాలి. ప్రతిజ్ఞ చేయించి వారికి అవగాహన కల్పించాలి. గ్రామైఖ్య సంఘం సభ్యులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులను భాగస్వాములు చేయాలి.

4న : ఇంటింటికీ తిరుగుతూ బడి బయట పిల్లల సర్వే నిర్వహించాలి. బడి బయట ఉన్న, బడికి వెళ్లని వారిని గుర్తించాలి, విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్‌లో నమోదు చేయాలి.

5 నుంచి 10 వరకు : అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాలి. బడీడు విద్యార్థులను గుర్తించాలి. గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేయాలి. ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలపై ప్రచారం చేయాలి. దివ్యాంగులను గుర్తించి భవిత కేంద్రాల్లో చేర్పించాలి.

11న : గ్రామ సభ నిర్వహించాలి. 3వ తేదీ నుంచి 10 వరకు చేపట్టిన కార్యక్రమాలపై చర్చించాలి. గుర్తించిన విద్యార్థులు 12వ తేదీ నుంచి పాఠశాలకు వచ్చేందుకు కృషి చేయాలి.

12 నుంచి 19 వరకు కార్యక్రమాలు

12న : పాఠశాలల్లో స్వాగత దినోత్సవం నిర్వహించాలి. పాఠశాల రెడీనెస్ ప్రోగ్రాం నిర్వహించాలి.

13న : ఎఫ్ఎల్ఎన్(ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ లర్నింగ్ ఇంప్రూమెంట్ డే.

14న : సామూహిక అక్షరాభ్యాసం, ఉన్నత పాఠశాలలో బాల సభ

15న : బాలికా దినోత్సవం

18న : డిజిటల్ తరగతులపై అవగాహన, మొక్కలు నాటే కార్యక్రమం

19న : క్రీడా దినోత్సవం



సిర్పూర్(యూ)లో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులు

అందరి భాగస్వామ్యం..
ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం 7 గంటల నుంచి 11 వరకు బడిబాట నిర్వహించనున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లాస్థాయి అధికారులను ఇందులో భాగస్వాములను చేయనున్నారు. కలెక్టర్, జిల్లా విద్యాధికారి, మండల అభివృద్ధి అధికారులు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక కార్యక్రమాల్లో పాలుపంచుకోనున్నారు. గ్రామాల్లో వీవో సభ్యులు, హెచ్ఎంలు, టీచర్లు, హెచ్‌డబ్ల్యూవోలు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు కూడా హాజరయ్యేలా చూడా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.

ప్రవేశాలు పెంచాలి



సర్కారు స్కూళ్లను బలోపేతం చేసేందుకు జూన్ 3 నుంచి 11 వరకు ప్రతీ పాఠశాల పరిధిలో బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకురావాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలి. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి.
– పి.అశోక్, డీఈవో

న్యూస్‌రీల్

అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో బుధవారం రాష్ట్ర అవతరణ వేడుకల నిర్వహణపై అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉదయం 9 గంటలలోగా జాతీయ పతకావిష్కరణ చేయాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఉదయం 9 గంటలకు నిర్వహించే వేడుకలకు అధికారులు, సిబ్బంది హాజరు కావాలన్నారు. కార్యక్రమానికి వచ్చే అతిథులు, అధికారులు, విద్యార్థులకు తాగునీరు, అల్పాహారం అందించే ఏర్పాటు చేయాలని కలెక్టరేట్ ఏవోను ఆదేశించారు. వేదికను అందంగా అలంకరించి, షామియానాలు వేయాలన్నారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. సమావేశంలో అధికారులు లోకేశ్వర్‌రావు, రఫత్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు



మరమ్మతు చేయిస్తున్న కమిషనర్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ భుజంగ్‌రావు తెలిపారు. పట్టణంలోని నూర్‌నగర్‌లో నెలకొన్న తాగునీటి సమస్యను బుధవారం పరిష్కరించామని పేర్కొన్నారు. కాలనీలోని పైప్‌లైన్ చెడిపోయి మూడు రోజులుగా మిషన్ భగీరథ తాగునీరు రావడం లేదని స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టామన్నారు. పట్టణంలో పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ ఇతర సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

టీపీటీఎఫ్‌తోనే సమస్యల పరిష్కారం



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

జైనూర్: టీపీటీఎఫ్‌తోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని, సమస్యలను నిత్యం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఘనత తమ సంఘానికే దక్కుతుందని రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగ్‌రావు అన్నారు. టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిర్పూర్(యూ) మండలం మహగాంలో బుధవారం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎన్నో ఉద్యమాలు చేపట్టామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులు చెల్లించడంతోపాటు బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కనక వెంకటేశ్వర్‌రావు, ప్రధానోపాధ్యాయురాలు అనిత, నాయకులు మారుతి, ఆత్రం ఆనంద్‌రావు, కోట్నక పాండురంగ్, జగ్జీవన్, భీంరావు, తార తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని వినతి

ఆసిఫాబాద్‌అర్బన్: చింతలమానెపల్లి మండలంలో దళితుల పట్టా భూములు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం జిల్లా కేంద్రంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావుకు వినతిపత్రం అందించారు. అనంతరం రాష్ట్ర నాయకులు కేశవ్‌రావు మాట్లాడుతూ దళితుల భూములు కబ్జా చేసి రికార్డులు తారుమారు చేసిన వారిని చట్టపరంగా శిక్షించాలన్నారు. భూముల వద్దకు వెళ్తే బాధితులను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చింతలమానెపల్లికి చెందిన ఓ ప్రజాప్రతినిధితోపాటు పలువురు దాదాపు 40 ఎకరాలు అక్రమంగా పట్టా చేసుకున్నారని ఆరోపించారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- జిల్లా కేంద్రంలో విత్తన దుకాణాలు తనిఖీ



ఫర్టిలైజర్ షాపులో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే విత్తన వ్యాపారులను హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లోని ఫర్టిలైజర్ షాపులను బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువులు, విత్తనాల నిల్వలు, ధరల పట్టికను పరిశీలించారు. దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేసిన రైతులను ధరల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విత్తన బ్యాగులు, రశీదులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు విత్తనాలు నాటిన తర్వాత రశీదులు భద్రపరుచుకోవాలని సూచించారు. డీలర్లు, డీలర్లు విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే అధికారుల దృష్టికి తీసుకువస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ శాఖ అధికారి కృష్ణారెడ్డి, ఇన్‌చార్జి ఏవో ఖాదర్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

ఆసిఫాబాద్‌రూరల్: బడిబాట కార్యక్రమంలో బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, డీఈవో అశోక్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 3 నుంచి 11 వరకు బడిబాట కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలన్నారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి పెండింగ్ పనులు పూర్తి చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని సూచించారు. గతేడాది వసతి గృహాలకు గైర్హాజరైన వారిని గుర్తించి బడుల్లో చేర్పించాలన్నారు.

గ్రూప్– 1 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి
- కాగజ్‌నగర్‌లోని పరీక్ష కేంద్రాలు పరిశీలన

కాగజ్‌నగర్‌రూరల్: జిల్లాలో జూన్ 9న గ్రూప్– 1 ప్రిలిమ్స్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని వసుంధర డిగ్రీ, జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పరీక్ష కోసం స్ట్రాంగ్ రూంల నుంచి ప్రశ్నపత్రాలను పోలీసుశాఖ బందోబస్తు మధ్య కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో మొత్తం 13 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్ష నిర్వహణను పర్యవేక్షిస్తాయన్నారు. అభ్యర్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. సెంటర్ లోపలికి సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని స్పష్టం చేశారు.

గడువులోగా మరమ్మతులు పూర్తి చేయాలి
అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి, మరమ్మతులు గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. పట్టణంలోని పలు పాఠశాలల్లో పనులను బుధవారం పరిశీలించారు. ప్రతిరోజూ మండల విద్యాధికారులు, నోడల్ అధికారులు తమ పరిధిలోని పాఠశాలలను సందర్శించాలన్నారు. పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట పరీక్ష ప్రాంతీయ సమన్వయకర్త లక్ష్మీనరసింహం, ఎంఈవో భిక్షపతి తదితరులు ఉన్నారు.

భవిష్యత్తు కోసం సమష్టిగా పని చేయాలి



ఐక్యత చాటుతున్న మాదిగ సంఘాల మహాకూటమి నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: మాదిగ జాతి భవిష్యత్తు కోసం సమష్టిగా పని చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి ఇరిగిరాల భాస్కర్ మాదిగ పిలుపునిచ్చారు. కాగజ్‌నగర్ పట్టణంలో బుధవారం మాదిగ సంఘాల మహాకూటమి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగ జాతి భవిష్యత్తు కోసం అన్ని విభాగాలు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. కులపెద్దలు, ఉద్యోగులు, మేధావులు, యువకులు, విద్యార్థులను భాగస్వామ్యం చేయాలన్నారు. అనంతరం నూతన అడహక్ కమిటీ బాధ్యులను ప్రకటించారు. మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జిగా రేగుంట రామలింగం, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌చార్జీలుగా ఇగురప్ప మల్లికార్జున్, చిలుముల సురేశ్‌కుమార్, కోగిల శ్రీనివాస్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీలుగా దాసారపు రమేశ్, అయిళ్ల రాజం, కాగజ్‌నగర్ ఇన్‌చార్జిగా నక్క శంకర్ మాదిగను ప్రకటించారు. సమావేశంలో నాయకులు గోగర్ల నరేశ్, చిలుముల పురుషోత్తం, నక్కస్వామి, అసంపల్లి వేణు, చిలుముల చక్రవర్తి, తిరుపతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో లెక్కల్లేవ్..!



బెజ్జూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం

- బెజ్జూర్ వ్యవసాయ సహకార సంఘంపై పర్యవేక్షణ కరువు
- రూ.4 కోట్ల లావాదేవీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయని వైనం
- సకాలంలో ఎరువులు, విత్తనాలు అందక రైతులకు అవస్థలు

బెజ్జూర్(సిర్పూర్): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో అన్నదాతలకు సరైన సేవలందడం లేదు. రుణాలు, ఎరువులు, విత్తనాలు, యూరియా సకాలంలో అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడి ఆడిట్ నామమాత్రంగా చేపడుతుండడంతో అవకతవకలకు ఆస్కారం ఏర్పడుతోంది. 2017 సంవత్సరం నుంచి ఆన్‌లైన్ విధానం అమలవుతుండగా.. 2023 నుంచి జిల్లాలో ఈ ప్రక్రియ చేపట్టలేదు. లావాదేవీలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

రుణమాఫీలోనూ అవకతవకలు..!
2007, 2014, 2018 సంవత్సరాల్లో ప్రభుత్వాలు రైతులకు పంట రుణాలు మాఫీ చేశాయి. బెజ్జూర్ సహకార సంఘం బ్యాంకులో 2,374 మంది ఖాతాదారులు పంట రుణాలు పొందారు. 366 దీర్ఘకాలిక రుణాలు, 55 మంది దీర్ఘకాలిక పర్సనల్ రుణాలు పొందిన వారు ఉన్నారు. ప్రస్తుతం మార్జిన్ అకౌంట్‌లో బ్యాలెన్సింగ్ రూ.30 లక్షలు ఉన్నాయి. పంట రుణాలు చెల్లించిన రైతుల పేరిట సైతం రుణమాఫీ వచ్చింది. వాటిని సంబంధిత రైతులకు ఇవ్వకుండా కార్యాలయ అధికారి జేబు నింపుకున్నాడనే ఆరోపణలు వస్తున్నాయి. కోర్టు కేసులకు సైతం సంఘం నగదునే వినియోగించుకున్నారని, దాదాపు రూ.3.60లక్షలు పర్సనల్ కోర్టు కేసులకు వినియోగించుకున్నట్లు సమాచారం. ఇక్కడ గతంలో పనిచేసిన సీఈవోతోపాటు ప్రస్తుతం పని చేస్తున్న అధికారి కూడా లెక్కకు మించిన ఆస్తులు కూడబెట్టుకున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సహకార సంఘం కార్యాలయంలో లావాదేవీల వివరాలను ఈనెల 31 లోపు ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంది. 2022 సంవత్సరంలో ఆడిట్లో రూ.27 లక్షల రికవరీకి ఆదేశించినట్లు అధికారులు చెబుతున్నారు. రికవరీ డబ్బులకు కూడా లెక్కలు చూపాల్సి ఉంది. ఈ విషయమై ఇన్‌చార్జి డీసీవో మోహన్‌ను వివరణ కోరగా.. 'ఈ నెల 31లోపు సంబంధిత డాటా ఎంట్రీ చేయాలి. ప్రతిదానికి లెక్క చూపాల్సి ఉంది. ఒకవేళ అలా చేయకపోతే వారిపై శాఖపరమైన చర్యలు తప్పకుండా తీసుకుంటాం. ఇద్దరు సీఈవోలదే బాధ్యత' అని వివరించారు.

రూ.4 కోట్లకు లెక్కలేవి..?
జిల్లాలో 12 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. గడిచిన రెండు, మూడేళ్లుగా కొన్ని సంఘాల్లో రైతులకు బ్యాంక్ రుణాలు, ఎరువులు అందడం లేదు. 1983లో రెబ్బెన సహకార సంఘంగా ఏర్పడిన బెజ్జూర్ సహకార సంఘంపై అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడ దాదాపు రూ.4 కోట్ల లెక్కలు తేలాల్సి ఉంది. గతంలో పంట మొదలుకుని అన్నిటికీ రికార్డులు ఉండేవి. 2017లో ఆన్‌లైన్ విధానం ప్రారంభమైంది. అప్పటినుంచి 2023 వరకు దాదాపు రూ.4 కోట్ల లావాదేవీలకు సంబంధించి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. ఉన్నతాధికారుల ఆదేశాలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

జీతాలు రాక అవస్థలు
ప్రభుత్వం 2023 జనవరి నుంచి రాష్ట్రవ్యాప్తంగా 44 జీవో ద్వారా హెచ్‌ఆర్ పాలసీ అమల్లోకి తెచ్చినా బెజ్జూర్ సహకార సంఘం సిబ్బంది మాత్రం 44 జీవో అమలుకు నోచుకోలేదు. ఈ జీవో ప్రకారం సంఘంలోని సిబ్బంది జీతాలకు నిధులు లేకుంటే జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మూడేళ్ల వరకు జీతాలు చెల్లించాలి. కానీ బెజ్జూర్ సహకార సంఘంలో నిధులున్నా జిల్లా బ్యాంక్ సీఈవో జీతాలకు అనుమతి ఇవ్వకుండా వేధిస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. సంఘం, డీఎల్ఈసీ ఒప్పందం కుదుర్చుకొని సిబ్బందికి ఇప్పటివరకు 44 జీవో ప్రొసీడింగ్స్ అప్రూవ్ ఇవ్వడం లేదు. ఏడాదికి పైగా డీఎల్ఈసీ సమావేశాలు నిర్వహించడం లేదు. జీతాలు రాక విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది అవస్థలు పడుతున్నారు. అధికారులు మాత్రం కోట్ల రూపాయలకు సంబంధించిన డాటా ఎంట్రీ చేయకపోవడంతో సిబ్బందికి జీతాలు రావడంలేదని సమాధానం చెబుతున్నారు.

12లోగా మరమ్మతులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఏసీఎంవో ఉద్ధవ్

కెరమెరి(ఆసిఫాబాద్): గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ప్రాథమిక పాఠశాలల్లో జూన్ 12లోగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన మరమ్మతులు పూర్తి చేయాలని ఐటీడీఏ పాఠశాలల జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి(ఏసీఎంవో) పుర్క ఉద్ధవ్ అన్నారు. మండలంలోని అనార్‌పల్లి గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించడంతోపాటు మైనర్, మేజర్ రిపేర్లు చేపట్టాలన్నారు. ప్రధానోపాధ్యాయులు పనులు నేరుగా పర్యవేక్షించాలని ఆదేశించారు. గురువారం నుంచి పనులు ప్రారంభించాలని సూచించారు. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో అనార్‌పల్లి కాంప్లెక్స్ హెచ్ఎం బలిరాం, హెచ్‌డబ్ల్యూవో వసంత్‌రావు, ఎస్సీఆర్పీలు శ్యాంరావు, నరేశ్, ప్రధానోపాధ్యాయులు, వీవో సభ్యులు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

వడదెబ్బతో హమాలీ కార్మికుడు మృతి


తోట తిరుపతి(ఫైల్)

నెన్నెల/భీమిని: నెన్నె ల మండల కేంద్రానికి చెందిన హమాలీ కార్మికుడు తోట తిరుపతి(36) బుధవారం వడదెబ్బతో మృతిచెందాడు. తోటి హమాలీలు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం కన్నెపల్లి మండలం ఖాజీపల్లి గ్రామంలో వడ్లు తూకం వేసి లోడ్ చేసేందుకు తోటి హమాలీలతో కలిసి వెళ్లాడు. ధాన్యం బస్తాలను డీసీఎం వ్యాన్‌లో లోడ్ చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలి అపస్మారక స్థితికి చేరాడు. నీళ్లు తాగించి ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతిచెందాడు. కన్నెపల్లి పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య శ్రీలత, కుమారులు శ్రేయాన్(7), హర్షవర్ధన్(4) ఉన్నారు.

వడదెబ్బతో గిరిజన యువకుడు మృతి


భీమ్‌రావు మృతదేహం

తాండూర్: మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన గిరిజన యువకుడు టోకెమ్ భీమ్‌రావు (26) బుధవారం వడదెబ్బ తగిలి మృతిచెందాడు. మాదారం ఎస్సై గొల్లపల్లి అనూష తెలిపిన వివరాల ప్రకారం.. భీమ్‌రావు తన స్నేహితులతో కలిసి సోమవారం సోనాపూర్ గ్రామంలో జరిగిన పెళ్లికి ఎండలో నడుచుకుంటూ వెళ్లాడు. పెళ్లి తంతు ముగిశాక మంగళవారం రాత్రి ఇంటికి చేరిన కొద్ది సేపటికే వాంతులు చేసుకున్నాడు. బుధవారం భీమ్‌రావును కుటుంబీకులు బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయాడు. భీమ్‌రావు తల్లిదండ్రులు చిన్నతనంలోనే మృతిచెందగా పెదనాన్న టోకెమ్ దోబీ వద్ద ఉంటున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

రెబ్బెన(ఆసిఫాబాద్): వాహనం ఢీకొని గాయపడిన రెబ్బెన మండలం తుంగెడ గ్రామానికి చెందిన డొంగ్రి బట్టయ్య(90) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 19న బట్టయ్య తుంగెడలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే గ్రామానికి చెందిన డోంగ్రి శశిధర్ టాటా ఏస్ గోల్డ్ వాహనాన్ని అజాగ్రత్తగా రివర్స్ తీస్తూ బట్టయ్యను ఢీకొట్టాడు. గాయాలపాలైన బట్టయ్యను కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్ తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంలో చేర్పించగా బుధవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు పోచయ్య ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై వెల్లడించారు.

అగ్ని‘గండమే’..!

- ప్రైవేటు ఆస్పత్రులు, వాణిజ్య భవనాల్లో భద్రత కరువు
- పలు దుకాణాల్లో అగ్ని ప్రమాదాలు
- పేరుకే ఫైర్‌సేఫ్టీ పరికరాలు
- అనుమతి లేకుండానే నిర్మాణాలు


మంచిర్యాల మార్కెట్ రోడ్డులో షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయిన చెప్పల దుకాణం(ఫైల్)


బెల్లంపల్లి చౌరస్తాలో ఒకదానిని ఒకటి ఆనుకుని నిర్మించిన భవనాలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా కేంద్రంగా మారడంతో పెద్దపెద్ద షాపింగ్ కాంప్లెక్సులు ఏర్పాటవుతున్నాయి. కార్పొరేట్‌స్థాయిలో వైద్యం పేరిట పలు ప్రైవేటు ఆస్పత్రులు వెలుస్తున్నాయి. పారిశ్రామిక, సింగరేణి ప్రాంతం కావడంతో ఈ ప్రాంత ప్రజలను ఆకర్షించేలా వ్యాపార, వాణిజ్య కేంద్రాలను తళతళ మెరిసేలా ఫ్లోర్‌లతో చూడముచ్చటగా షాపింగ్ కాంప్లెక్సులు నిర్మిస్తున్నారు. పైకి చూడ్డానికి అన్ని హంగులతో ఉండే దుకాణాల్లో భద్రత చర్యలు పాటించడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారు. దుకాణ సముదాయాల్లో చిన్నపాటి అగ్ని ప్రమాదం జరిగినా భద్రత పొందే వెసులుబాటు ఏర్పాటు చేసుకోవడం లేదు. ప్రైవేటు ఆస్పత్రుల్లో సైతం ఫైర్‌సేఫ్టీ కోసం ప్రతీఫ్లోర్‌లో వాటర్ స్ప్రింక్లర్లను ఏర్పాటు చేసుకుంటున్నా వాటి పనితీరు పరిశీలించడంలేదు. భవన నిర్మాణంకోసం మున్సిపాలిటీ నుంచి అనుమతులు తీసుకుంటున్నా అగ్నిమాపక శాఖ ద్వారా ఎన్‌వోసీ లేదా అనుమతులు తీసుకోవడం లేదు. దీంతో అగ్ని ప్రమాదాలు జరిగితే మాత్రం పెద్ద ఎత్తున ప్రాణనష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. జిల్లా కేంద్రంలో ఇటీవల రెండు దుకాణాల్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగింది. రెండు ఘటనలు రాత్రివేళల్లో జరగడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకున్నా సామగ్రి పూర్తిగా కాలిపోయి ఆర్థికంగా నష్టం వాటిల్లింది.

మంచిర్యాలకే రాకపోకలు..

మంచిర్యాల జిల్లాగా మారకముందు నుంచే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తూర్పు జిల్లా కేంద్రంగా పేరుగాంచింది. దక్షిణాది మధ్య రైల్వేలైను ఈ ప్రాంతం నుంచే వెళ్తుండడంతో ఇక్కడి మార్కెట్ ఇతర రాష్ట్రాలతో ముడిపడి ఉంది. జిల్లాతో పాటు కుమురంభీం ఆసిఫాబాద్, మహారాష్ట్ర, తదితర ప్రాంతాల ప్రజలు వ్యాపారానికైనా, వైద్యానికైనా మంచిర్యాలకే వస్తుంటారు. దీంతో హైదరాబాద్ వంటి నగరాల్లో వెలుస్తున్న కార్పొరేట్ బట్టల దుకాణాలు, బంగారం దుకాణాలు మంచిర్యాలలో బ్రాంచీలు తెరుస్తున్నాయంటే ఇక్కడ వ్యాపారం ఏవిధంగా సాగుతుందో తెలుస్తుంది. ఒక భవనాన్ని ఆనుకుని మరో భవనం ఉండడం, ఇళ్లకు సమీపంలోనే ఈ భవనాలను నిర్మించడం వల్ల అగ్ని ప్రమాదం జరిగితే ఫైరింజన్ వచ్చేందుకు కూడా స్థలం లేదు. ఇందులో ఏ ఒక్కటి కూడా అగ్నిమాపక శాఖ అనుమతిని తీసుకోకుండానే నిర్వహిస్తుండడం గమనార్హం.

నిబంధనల అమలుపై నిర్లిప్తత...

- అగ్నిమాపక శాఖ నిబంధనల ప్రకారం ఆస్పత్రులు, ఇతర వ్యాపార సముదాయాలు అగ్నిప్రమాదం సంభవిస్తే మంటలు ఆర్పేందుకు అవసరమైన పూర్తి సన్నద్ధతను కలిగి ఉండాలి.
- షాపింగ్ కాంప్లెక్సులు, ఆస్పత్రుల నిర్వాహకులు తమ భవనాల చుట్టూ ఫైరింజన్ తిరిగేలా రోడ్డు వెసులుబాటు కలిగి ఉండాలి.
- 15 మీటర్ల కంటే ఎత్తు దాటిన భవనాలకు నిర్మాణ సమయంలోనే పైఅంతస్తులో(టెర్రస్) వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేయాలి. వాటి నుంచి ప్రతీఫ్లోర్‌కు పైపులు(ఆటోమేటిక్ స్ప్రింక్లర్లు) అమర్చి మంటలు చెలరేగిన సమయంలో వాటిని ఓపెన్ చేసి ఆ నీటితోనే ఆర్పే ఫైర్ సేఫ్టీ టెక్నాలజీని కలిగి ఉండాలి.
- అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉండే పరిశ్రమలు, ఇతర వ్యాపార సముదాయాలు పట్టణ శివారులోనే ఏర్పాటు చేసేందుకు అనుమతించాలి.
- మంటలు ఆర్పే అగ్నిమాపక యంత్రాలు ప్రతీ అంతస్తులోనూ తప్పకుండా ఉంచాలి. వాటి వినియోగంపై సిబ్బందికి అవగాహన ఉండాలి.
- ప్రతీ అంతస్తులో అగ్ని ప్రమాదం జరిగేందుకు ఆస్కారం ఉన్నట్లు పొగను గుర్తించే ఆటోమేటిక్ స్మోక్ అలారం ఏర్పాటు చేయాలి.

నిబంధనలు పాటించాలి



మంచిర్యాలలోని చాలా భవనాలు, ప్రైవేటు ఆస్పత్రులు అగ్నిమాపక శాఖ నిబంధనల మేరకు నిర్వహించడం లేదు. 15 మీటర్ల కంటే ఎత్తున్న భవనానికి అగ్నిమాపక శాఖ అనుమతి తప్పనిసరి. మంచిర్యాలలోని ఏ ఒక్క ప్రైవేటు ఆస్పత్రి నిర్వాహకులు అగ్నిమాపక శాఖ ద్వారా అనుమతి తీసుకోలేదు. ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటిస్తే ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే దానిని ఆపేందుకు అవకాశం ఉంటుంది.
– అజయ్‌బాబు, ఫైర్‌సేఫ్టీ ఆఫీసర్, మంచిర్యాల

జాజులపేట విద్యుత్ సమస్య పరిష్కారం


అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద డీఈ, ఏడీ

సాక్షి ఎఫెక్ట్..

వేమనపల్లి: మండలంలోని జాజులపేట గ్రామానికి ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు వెళ్లి బుధవారం విద్యుత్ సమస్య పరిష్కరించారు. గత 15 రోజులుగా తరచూ విద్యుత్ అంతరాయంతో ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు, సిబ్బంది మధ్య మంగళవారం ఘర్షణ చోటు చేసుకుంది. ఈ విషయమై ‘కరెంట్ ఇయ్యం.. దిక్కున్న చోట చెప్పుకోండి’ శీర్షికన ‘సాక్షి’లో కథనం ప్రచురితమైంది. ట్రాన్స్‌కో సీఎండీ ఈ కథనంపై తీవ్రంగా స్పందించి జిల్లా ట్రాన్స్‌కో అధికారులను అప్రమత్తం చేశారు. ఆయన ఆదేశాలతో బెల్లంపల్లి డీఈ రాజన్న, ఏడీ రాంచందర్, ఏఈ దీక్షిత్‌లు హుటాహుటిన గ్రామానికి వెళ్లారు. ఎస్సీ కాలనీ సమీపంలో చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి మరొకటి అమర్చారు. ట్రాన్స్‌కో డీఈ రాజన్న మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని, ఎలాంటి అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ విద్యుత్ మీటర్లు అమర్చుకోవాలని, విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని తెలిపారు. ఏఈ దీక్షిత్, జేఎల్ఎం ఉదయ్‌కుమార్ ఉన్నారు.

పేదల ఆకలి తీర్చిన ఏబీఏపీ


తిరుమల్‌రావును సన్మానిస్తున్న సభ్యులు

మంచిర్యాలఅర్బన్: అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ(ఏబీఏపీ) ఆధ్వర్యంలో పెరుగన్నంతో పేదల ఆకలి తీర్చిందని ఏబీఏపీ రాష్ట్ర అధ్యక్షుడు బేతి తిరుమల్‌రావు అన్నారు. బుధవారం మంచిర్యాల ఐబీ చౌరస్తాలో 40 రోజులుగా నిర్వహిస్తున్న పెరుగన్నం ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహాయంతో రోజుకు 500 మందికి పెరుగన్నం పంపిణీ చేసినట్లు తెలిపారు. పెరుగన్నం దాతలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజ్‌కిరణ్, అర్చకుడు నరహరిశర్మ, ఏబీఏపీ గౌరవ అధ్యక్షుడు నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి సంతోష్, సహాయ కార్యదర్శులు సిరిపురం రాజేశం, సత్యనారాయణ పాల్గొన్నారు.

సింగరేణికి బకాయిలు చెల్లించాలి

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.29 వేల కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య డిమాండ్ చేశారు. బుధవా రం ఆయన ఎస్ఆర్పీ 3 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుంచి బకాయిలు రావాల్సి ఉందని, కొత్త ప్రభుత్వంలోనైనా చెల్లిస్తారనుకుంటే పట్టించుకోవడం లేదని అన్నారు. సింగరేణిలో కొత్త గనులు తవ్వడానికి నిధులు లేవని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం సంస్థ సాధించిన లాభాల నుంచి 35 శాతం వాటాను కార్మికులకు చెల్లించాలన్నారు. జూ న్‌లోనే విద్యార్థుల ఫీజులు, పుస్తకాలు కొనడం వంటి ఖర్చులు కార్మికులకు ఉంటాయని, ఈ మొత్తాన్ని జూన్‌లోనే చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, పిట్ కార్యదర్శి మురళి చౌదరి, మైనింగ్ స్టాఫ్ నాయకులు మారుపెల్లి బాపు, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, నాయకులు లచ్చన్న, రామచందర్, మల్లికార్జున్, నాగేశ్వరరావు, రవి పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రాంగణంలో ఫంక్షన్ హాల్

- అద్దెకు ఇవ్వాలనే యోచనలో అధికారులు
- బస్టాండ్‌కు రాని ప్రయాణికులు


బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న ఖాళీ స్థలంలోని ఓ భాగం

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలోని ఖాళీ స్థలం వాణిజ్య రూపం దాల్చే అవకాశం కనిపిస్తోంది. బస్టాండ్‌కు కొంతకాలంగా ప్రయాణికుల ఆదరణ లేక వెలవెలబోతోంది. ఈ కారణంగా బస్టాండ్‌ను ఎత్తివేయలేని పరిస్థితులు ఉండగా.. ఖాళీ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అద్దెకు ఇవ్వాలనే యోచనలో ఆర్టీసీ అధికారులు ఉన్నట్లుగా తెలుస్తోంది. ఫంక్షన్ హాల్ నిర్మాణానికి ఔత్సాహిక వ్యాపార వర్గాలకు కేటాయిస్తే ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నట్లు తెలుస్తోంది. బస్టాండ్‌కు పది ఎకరాల భూమి ఉండగా.. ఇందులో మూడెకరాలు వినియోగంలో, ఏడెకరాలు పడావుగా ఉంటోంది. కొంత ఖాళీ స్థలాన్ని అద్దెకు ఇవ్వడం సముచితమని ఆర్టీసీ యాజమాన్యానికి నివేదిక పంపించడానికి ఆసిఫాబాద్ ఆర్టీసీ బస్ డిపో అధికారులు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. పార్లమెంటు ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ప్రతిపాదనలు కార్యరూపం దాల్చే అవకాశాలు ఉన్నాయి.

నిరాదరణకు గురై..

ఆర్టీసీ బస్టాండ్‌కు ప్రయాణికులు స్వల్పంగా వస్తుండగా.. మెజార్టీ ప్రయాణికులు పాతబస్టాండ్, కాంటా చౌరస్తా, ఏఎంసీ, సింగరేణి ఏరియా ఆస్పత్రి, కాల్‌టెక్స్ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపైన ఏర్పాటు చేసిన బస్టాప్‌ల వద్ద బస్సెక్కి గమ్యస్థానం చేరుకుంటున్నారు. ఇక రాత్రివేళ బస్టాండ్ ఆవరణలో తప్పా చుట్టుపక్కల వీధి దీపాలు లేక, ఉన్నవి వెలుగక చిమ్మచీకటి ఆవరించి ఉంటోంది. దీంతో ప్రయాణికులు రాత్రి పూట అటువైపే రావడం లేదు. నైట్ హాల్టింగ్ బస్సు డ్రైవర్, కండక్టర్లు మాత్రమే బస్టాండ్‌లో ఉంటున్నారు. ప్రయాణికుల సందడి కానరాక బస్టాండ్ నిరాదరణకు గురవుతోంది.

స్టాల్స్ అద్దెకు విముఖత

బస్టాండ్‌లో స్టాల్స్ ఏర్పాటుకు గదులు ఉన్నాయి. ఏటా ఆ గదుల అద్దె కోసం ఆర్టీసీ అధికారులు టెండర్లు పిలిచినా సానుకూల స్పందన రావడం లేదు. మూడు గదులు ఖాళీగా ఉన్నా అద్దెకు తీసుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ప్రస్తుతం బస్టాండ్ ప్రాంగణంలో ఆర్టీసీ కార్గో సేవలు తప్పా మరేలాంటి సేవలు, సౌకర్యాలు అందుబాటులో లేవు.

బస్‌డిపో మంజూరు కాక..

ఆసిఫాబాద్ ఆర్టీసీ బస్‌డిపో పరిధిలోని బెల్లంపల్లి బస్టాండ్‌కు ఎంతో ప్రత్యేకత ఉంది. బొగ్గుగనుల క్షేత్రమైన బెల్లంపల్లిలో కన్నాల బస్తీ శివారులో ప్రధాన రహదారిని ఆనుకుని 1991లో ఆర్టీసీ యాజమాన్యం బస్టాండ్ నిర్మించింది. మంచిర్యాల–ఆసిఫాబాద్ బస్ డిపోల మధ్యన ఉన్న ఈ బస్టాండ్ మీదుగా రోజువారీగా పదుల సంఖ్యలో బస్సులు సుదూర ప్రాంతాలకు రాకపోకలు చేస్తున్నాయి. బస్ డిపో మంజూరు అంశం ఎన్నికల హామీగా మారిందే గానీ ఆచరణలో సాధ్యం కావడం లేదు.

ప్రతిపాదనలు పంపిస్తాం

బెల్లంపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో కొంతకాలం నుంచి ప్రయాణికులు కానరావడం లేదు. బజారు ఏరియా మీదుగా బస్ సర్వీసులను నడిపిస్తుండడంతో చాలామట్టుకు ప్రయాణికులు బస్టాప్‌ల వద్ద బస్సెక్కుతున్నారు. ఖాళీ స్థలంలో కొంత భాగాన్ని ఫంక్షన్ హాల్ ఏర్పాటుకు ప్రైవేట్ వ్యక్తులకు అద్దెకు ఇవ్వాలని సమాలోచనలు చేస్తున్నాం. తద్వారా ఆర్టీసీకి ఆదాయం కూడా వస్తుంది. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత యాజమాన్యానికి ప్రతిపాదనలు పంపిస్తాం.
– బి.విశ్వనాథ్, ఆర్టీసీ డిపో మేనేజర్, ఆసిఫాబాద్

ఇసుక ట్రాక్టర్ విడిచి పెడితే రూ.20 వేలు!

- పట్టుకుని వదిలిపెట్టిన అధికారులు
- సంబంధం లేదంటూ బుకాయింపు


వివరాలు వెల్లడిస్తున్న గ్రామానికి చెందిన యువకులు

వేమనపల్లి: మండలంలోని కల్లెంపల్లి గ్రామ సమీపంలో అర్ధరాత్రి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అటవీ అధికారులు పట్టుకున్న ఘటన వివాదాస్పదంగా మారింది. గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి చిరంజీవికి చెందిన ట్రాక్టర్‌లో అర్ధరాత్రి ప్రాణహిత నది నుంచి ఇసుక తరలించారు. గ్రామంలోని మరో వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు అటవీ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఎఫ్ఎస్ఓ బేగ్, ఎఫ్‌బీఓ పోచన్న, బేస్‌క్యాంపు సిబ్బంది వెంకటి తదితరులు ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. కేసు కాకుండా ఉండాలంటే రూ.20 వేలు చెల్లించాలని అటవీ సిబ్బంది డిమాండ్ చేసినట్లు ట్రాక్టర్ యజమాని చిరంజీవి ఆరోపించాడు. వేమనపల్లికి చెందిన తన బంధువు కీర్తి రవి వద్ద ఫోన్ పే ద్వారా డబ్బులు బదులు తీసుకుని అటవీ సిబ్బంది సూచించిన గురిజాల అంజన్నకు 1.14 గంటలకు ఫోన్ పే ద్వారా రూ.20 వేలు పంపించానని పేర్కొన్నాడు. ఎఫ్ఎస్ఓ బేగ్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్ స్విచ్‌ఆఫ్ వచ్చింది. ఎఫ్‌బీఓ పోచయ్య మాట్లాడుతూ అక్కడికి వెళ్లింది నిజమేనని, అటవీ భూమిని ఆనుకొని ఉన్న ప్రాణహిత నుంచి ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. రూ.20 వేలు తాము అడగలేదని, అతను ఎవరికి ఫోన్ పే ద్వారా చెల్లించారో తెలియదని సమాధానం ఇచ్చారు.

ఎస్టీపీపీ కార్మిక సమస్యలపై చర్చలు

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు(ఎస్టీపీపీ) కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై బుధవారం హైదరాబాద్‌లో డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ నేతృత్వంలో చర్చలు జరిపారు. హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో పలుమార్లు సమస్యల పరిష్కారానికి సమ్మె నోటీసులు అందించగా ఇప్పటికే పలు దఫాలుగా ఎస్టీపీపీ అధికారులు, కార్మిక సంఘం నాయులతో సమస్యలపై చర్చించారు. ఎస్టీపీపీలో అమలు చేస్తున్న వేతనాలు, అలవెన్సులు, హైపవర్ కమిటీ వేతనాలు అందించాలని కోరారు. దీనిపై ఉన్నతస్థాయి అధికారులతో చర్చిస్తామని సింగరేణి అధికారులు వెల్లడించారు. అనంతరం సింగరేణి భవన్‌కు వెళ్లి సీఎండీ కోఆర్డినేటర్ జీఎం నరేందర్‌కు సమస్యలు విన్నవించినట్లు హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు.

నైపుణ్య శిక్షణ తరగతులకు పేరు నమోదు

బెల్లంపల్లి: కుమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల పరిధిలోని రైతులకు నిర్వహించనున్న నైపుణ్య శిక్షణ తరగతులకు ఔత్సాహిక రైతులు పేరు నమోదు చేసుకోవాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకృతి వ్యవసాయం, వర్మీ కంపోస్టు తయారీ విధానం, పెరటి కూరగాయల సాగులో పాటించాల్సిన మెలకువలపై జూన్-జులై మాసాల్లో 3 రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు జూన్ 6లోపు బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కార్యాలయంలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. బ్యాచ్‌కు 25–30 మంది చొప్పున రైతులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యన కోరారు.

విద్యుత్ తీగలు తగిలి యువకుడి మృతి


పుప్పాల మహేష్(ఫైల్)

నెన్నెల: మండల కేంద్రంలోని సుంకరివా డకు చెందిన పుప్పాల మహేష్(32) బుధవారం విద్యుత్ తీగలు తగిలి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేష్ తన భార్య స్వప్నతో కలిసి పరిగే మామిడికాయలు కోసేందుకు జంగాల్‌పేటకు వెళ్లాడు. జంగాల్‌పేట కొత్తగూడంలో మామిడి చెట్టెక్కి కాయలు కోస్తుండగా చెట్టుపై నుంచి వెళ్లే విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై కింద పడ్డాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి కూతురు హని(12), కుమారుడు చరణ్(10) ఉన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య


సురేశ్(ఫైల్)

జైపూర్: మండలంలోని కాన్కూర్ గ్రామానికి చెందిన నెండుగూరి సురేశ్ (32) మద్యానికి బానిసై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. జైపూర్ అదనపు ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కాన్కూర్‌కు చెందిన నెండుగూరి లక్ష్మి, బాపు దంపతుల చిన్న కుమారుడు సురేశ్ మద్యానికి బానిసయ్యాడు. నిత్యం మద్యం తాగుతూ ఉండేవాడు. ఈ నెల 27న వ్యవసాయ పొలం వద్ద పడుకోవడానికి వెళ్లి ఉదయం ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం చనిపోయాడు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అదనపు ఎస్సై తెలిపారు.

వరుస చోరీల దొంగ అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీపీ శ్రీనివాసులు, డీసీపీ అశోక్‌కుమార్, ఏసీపీ వెంకటేశ్వర్లు

- రూ.10.97లక్షల విలువైన బంగారం, వెండి, నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన రామగుండం సీపీ శ్రీనివాసులు

జైపూర్: వేమనపల్లి మండలం నీల్వాయి పోలీసుస్టేషన్ పరిధిలో వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగను పోలీసులు అరెస్టు చేశారు. రూ.10.97లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం జైపూర్ అసిస్టెంట్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రామగుండం సీపీ శ్రీనివాసులు మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. ఈ నెల 26, 27వ తేదీల్లో అర్ధరాత్రి కల్మలపేటకు చెందిన సల్పల శ్రీనివాస్ అలియాస్ లింగయ్య తాళం వేసి ఉన్న ఇళ్లలో బంగారం, వెండి, నగదు చోరీకి పాల్పడ్డాడు. కేతనపల్లి గ్రామానికి చెందిన నెండుగరి రామన్న ఫిర్యాదు మేరకు నీల్వాయి ఎస్సై శ్యామ్‌పటేల్, చెన్నూర్‌రూరల్ సీఐ సుధాకర్ చెన్నూర్ రూరల్ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. మంగళవారం మల్లంపేట వద్ద చేపట్టిన వాహన తనిఖీల్లో అనుమానాస్పదంగా కనిపించిన సల్పల శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. బ్యాగు తనిఖీ చేయగా బంగారం, వెండి ఆభరణాలతోపాటు రూ.2,62,600 నగదు లభించాయని, మొత్తం విలువ రూ.10,97,600 ఉంటుందని సీపీ వివరించారు. సీఐ సుధాకర్, ఎస్సై శ్యామ్‌పటేల్, పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

పల్లెల్లో రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ శ్రీనివాసులు హెచ్చరించారు. నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని పేర్కొన్నారు. నకిలీ విత్తనాలను విక్రయించి మోసాలకు పాల్పడుతున్న దళారీ వ్యవస్థ నిర్మూలనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తనిఖీలు షురూ

మంచిర్యాలక్రైం: ప్రభుత్వం పొగాకు ఉత్పత్తులను నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు. జిల్లా కేంద్రంలో పొగాకు ఉత్పత్తులు విక్రయించే సునీల్‌శర్మకు చెందిన ట్రేడర్స్‌లో స్థానిక సీఐ భన్సీలాల్ సిబ్బందితో కలిసి బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పొగాకు ఉత్పత్తులు కలిగిన రూ.2లక్షల విలువైన పది బ్యాగులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి స్థానిక ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వాసుకు తదుపరి విచారణ నిమిత్తం అప్పగించినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గుట్కా, అంబార్, ఇతర డ్రగ్స్, మత్తు పదార్థాలను నిషేధించిందని తెలిపారు. అక్రమంగా అమ్మకాలు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.